విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 09, జనవరి 2025

తగ్గిన రైతు మహిళ కూలి రేట్లు

• పెరుగుతున్న ధరలకు అనుగునంగా దక్కని ఫలితం..
• పంట కోతలకు ఇతర ప్రాంతాలకు వెళ్తూ ఇక్కట్లు..

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : పచ్చని పొలాలు కార్పొరేట్ మయం కావడంతో సాగు లేక స్థానికంగా వ్యవసాయ ఆధారిత పనులు కరు వయ్యాయి. దీంతో వ్యవసాయం మీద ఆధా రపడి తరాలుగా జీవనోపాధి పొందుతున్న రైతులు,రైతు మహిళా కూలీలు పనులు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జీవన ఆధారమే పోవడంతో గ్రామాలు కలతప్పు తున్నాయి. పొట్టకూటికోసం ఇతర జిల్లాలు, మండలాల లోకి రోజువారీ కూలీ లుగా పంట కొత పనులకు వెళుతున్నారు. అక్కడ కూడా మహిళా కూలీలకు పెద్దగా డిమాండ్ లేక పోవడంతో కూలి రేట్లు గతంలో కంటే భారీగా తగ్గిపోయాయి. దీంతో కుటుంబ జీవనం గడవడం కష్టంగా మారింది. మండలంలోని 33 గ్రామాలకు గాను 16 గ్రామాల పరిధిలోని పంట పొలాలన్నీటిని సిమెంట్ పరిశ్రమ యాజమాన్యాలు రైతుల నుండి కొనుగోలు చేశాయి. దీంతో ఆయా గ్రామాల పరిధిలో సాగు లేకపోవడంతో 2500 మంది మహిళా కూలీలు ప్రతిరోజు ఆటోలు,బోలోరో ట్యాంపర్‌లలో పంట కోత పనులకు వెళ్తున్నారు. మండలం జిల్లా సరిహద్దుల్లో ఉండడంతో వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం, పెద్దముడియం అనంతపురం జిల్లా యాడికి, తాడిపత్రి,గుత్తి, ఇదే జిల్లాలోని సంజామల, అవుకు, ఉయ్యాలవాడ తదితర మండలలోని పందు మిరప, పత్తి, శనగ తదితర పంట కోత పనులకు ఉదయం 6 గంటల నుండి వెళ్తూ సాయంత్రం ఐదు గంటలకు వస్తున్నారు. ఇంత కష్టపడుతున్న కష్టానికి పద్ద ఫలితం దక్కడం లేదు. రోజువారి కూలి రూ.240 మాత్రమే దక్కుతున్నది. గత సంవత్సరం ఇదే పంట కోతలకు వెళ్లినప్పుడు రూ.320 నుండి రూ.350 కూలి ఇచ్చేవారని కూలీలు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి ధరలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో మిగిలిన గ్రామంలో అక్కడక్కడ సాగు చేసిన పంట పొలాల్లో పెద్దగా పనులు లేకపోవడంతో పనులు దొరకడం లేదు. సిమెంట్ పరిశ్రమలు ఉన్న అందులో మహిళలకు తగ్గ ఉపాధి పనులు లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ప్రభుత్వం సాగులేని గ్రామా లలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి పనులు చేపట్టకపోవడంతో రైతు మహిళా కూలీలకు కష్టాలు తప్పడం లేదు.

అర్హులైన నిరుపేదలకి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: ఇళ్ల స్థలాలకై ఈనెల 10వ తేదీన సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్నలు కోరారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నిక హామీలలో అధికారంలో రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని, ప్రతి పేదవారికి గ్రామీణ ప్రాంతాల్లో3 సెంట్లు పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు స్థలాలు ఇచ్చి గృహ నిర్మాణ నిర్మిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట జరుగు కార్యక్రమానికి గతంలో సచివాలయంలో ఇచ్చిన అర్జీదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్య దర్శి ఎ.సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు వెంకట లక్ష్మీమ్మ, మండల నాయకులు శివ నాగయ్య, బి.ఉసేని, జి.గంగన్న, పైలట్, మాబు, సుబ్రహ్మణ్యం, లింగంపూడి మదిలేటి, రామాచారి, చాకలి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీస్, సెక్యూరిటీ సిబ్బంది

విశాలాంధ్ర - శ్రీశైలం: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తతో గొడవ పడి సుతారి లక్ష్మీ వైఫ్ ఆఫ్ సుతారి కిషోర్ రాయదుర్గం మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ లక్ష్మీ భర్తతో గొడవపడి చనిపోవాలనే ఉద్దేశంతో శ్రీశైలం రాగా శ్రీశైలం పోలీస్ స్టేషన్ సిబ్బంది దేవస్థాన సెక్యూరిటీ సిబ్బంది ఆమెను కాపాడి బంధువులకు సమాచారం ఇచ్చారు. తమ భర్త కిషోర్‌ని పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చి తమ కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సిఐ ప్రసాదరావు తెలిపాడు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - బనగానపల్లె: బనగానపల్లె ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం నందు సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి డోన్ ఆర్ ఓబులేసు విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. వసతి గృహ సంక్షేమ అధికారి ఎ.నాగేంద్ర విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - మహానంది: మండలంలోని అర్హులైన నిరు పేదలకు ఇళ్ల స్థలాల కోసం గత నెలలో లబ్ధిదారులతో అర్జీ పూర్తి చేసి సచివాలయంలో ఇవ్వడంజరిగింది. వాటిపైన ఏమాత్రం పట్టించుకోక పోవడం లేదని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు జనవరి 10వ తేదీన ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన అర్జీదారులతో ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నా మనీ సిపిఐ నాయకులు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన అర్జీ దారులు అందరూ కదిలి రావాలని సిపిఐ మండల కార్యదర్శి ఆర్.సామేలు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మహేశ్వరమ్మ, సిపిఐ నాయకులు గురుమూర్తి, దస్తగిరి సాహెబ్ పిలుపునిచ్చారు.

అంబటి బ్రదర్స్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని చింతలాయ పల్లి గ్రామంలో నాయకులు అంబటి శివ శంకర్ రెడ్డి జ్ఞాపకార్థం చింతలాయ పల్లి పంచాయతీ క్రికెట్ లీగ్ పోటీని అంబటి బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పంచాయతీ పరిధిలోని చింతలాయపల్లి, మదనంతపురం, ఎస్.చెన్నంపల్లి, రాఘవ రాజుపల్లి గ్రామాల పరిధిలో వారు మాత్రమే క్రికెట్ పోటీలో పాల్గొనడానికి అర్హులన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు అందిస్తామన్నారు. టిమ్స్ పేర్లు ఎంట్రీ చేసుకోడానికి చివరి తేదీ 9 అని, ఈనెల 11న క్రికెట్ లీగ్ మ్యాచ్ ప్రారంభమవుతుందని 14వ తేదీన ఫైనల్ మ్యాచ్ ఉంటుందని తెలిపారు. చింతలాయపల్లి గ్రామపంచాయతీలో యువకుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి లిగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి తెలిపారు. నాలుగు గ్రామాలకు చెందిన యువకులు క్రికెట్ లీగ్ పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడు మృతి

విశాలాంధ్ర - జూపాడు బంగ్లా: మండలంలోని మల్లెం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పుట్టల నాగరాజు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. నాగరాజు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మల్లెం గ్రామానికి చేరుకొని నాగరాజు పార్థేహానికి పూలమాల నివాళులర్పించారు. ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ నాగరాజు అకస్మాత్తుగా మృతి చెందిన చాలా బాధాకరమైన విషయం అని, టిడిపి పార్టీకి నాగరాజు మృతి తీరని లోటు అని ఆయన అన్నారు. గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుపాలు, దస్తగిరి, జయరాజు, టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని సిద్ధాపురం ప్రాజెక్టు ఫేజ్ -2 పంప్ హౌస్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మోటార్లను స్టార్ట్ చేసి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే రాజశేఖర రెడ్డి అనంతరం గంగమ్మకు ప్రత్యేక పూజలు, సారె సమర్పణ చేసారు. నెల రోజుల పాటు, రెండు పంపుల్లో రోజుకు 200 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది అన్నారు. రబీలో సాగుచేసిన పంటలకు సాగు నీటికి డొఖా ఉండదు రైతులు నిర్భయంగా సాగు చేసుకోండి అన్నారు. ఇది రైతు ప్రభుత్వం మంచి ప్రభుత్వమన్నారు. ఐదేళ్లలో సిద్ధాపురం ప్రాజెక్టును వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చేశారు. రాబోయే రోజుల్లో పిల్లకాలువలు పూర్తి, మరో తూము ద్వారా వెంకటాపురం, కృష్ణాపురం, ఇందిరేశ్వరం గ్రామాల్లోని మరో 5 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం అన్నారు.

వైకుంఠ ఏకాదశి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణంలోని జమ్మలమడుగు రహదారిలో వెలిసిన అష్టలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి వేడుకలు పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఏకాదశి రోజున స్వామివారికి అభిషేకం అర్చన పూజా కార్యక్రమం శ్రీనివాస గోదా కళ్యాణం మొదలగు వారిని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక వేద పండితులచే నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహించారు.

బానకచర్లలో ఏఐవైఎఫ్ నూతన శాఖ ఏర్పాటు

విశాలాంధ్ర - పాములపాడు: ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 6 నుండి 9 తేదీ వరకు జరుగు సందర్భంగా మండలంలోని బానకచెర్ల గ్రామంలో ఏఐవైఎఫ్ నూతన శాఖ ఏర్పాటు చేసేందుకు కార్యక్రమాన్ని ఆత్మకూరు సిపిఐ కార్యదర్శి టి.ప్రతాప్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఏఐవైఎఫ్ కార్యదర్శి నాగ రాముడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 6-9 వరకు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా మహాసభల నిర్వహణలో భాగంగా బనాకచర్ల గ్రామ శాఖ ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ మహాసభల్లో యువజనులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ ఏఐవైఎఫ్ నూతన కమిటీ అధ్యక్షులుగా సుధాకర్, కార్యదర్శిగా సూర్యప్రకాష్, ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి, బనాకచర్ల గ్రామ శాఖ సురేష్, రోజేష్, సిపిఐ నాయకలు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూమా నాగిరెడ్డి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: దివంగత నేత భూమా నాగిరెడ్డి 61 వ జయంతి వేడుకలు ఆళ్లగడ్డలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భూమా ఘాట్ వద్ద ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తాలుక టిడిపి యువ నాయకులు భార్గవ్ రామ్, భూమా జగద్విఖ్యాత్ రెడ్డి, మనవడు భూమా వీర నాగిరెడ్డిలు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి మంచి స్నేహితుడిగా, గొప్ప గురువుగా, అత్యున్న తమైన తండ్రిగా తనకు జీవించడం నేర్పించారన్నారు. తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆళ్లగడ్డను అభివృద్ధి పథంలో నడిపి చూపిస్తామని, నియోజకవర్గంలోని కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాష, టీడీపీ మండల కన్వీనర్ హరికుమార్ రెడ్డి, టిడిపి నాయకులు శివ యాదవ్, భాస్కర్ యాదవ్, కృష్ణమాచారి, రామాచారి, చింతకుంట్ల రాజశేఖర్ రెడ్డి, బద్రి సుధాకర్ రెడ్డి, బాలీశ్వర్ రెడ్డి, ఎయిర్టెల్ శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత అర్జీలు అందజేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: సిపిఐ రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపులో భాగంగా ఇల్లు లేని నిరుపేదలతో వ్యక్తిగత అర్జీలు అందజేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోస్పాడు మండల కార్యదర్శి జి.హరినాథ్ పిలుపు నిచ్చారు. బుధవారం గోస్పాడు సీపీఐ కార్యాలయంలో గోస్పాడు శాఖ సహాయ కార్యదర్శి ఎస్ జిలాని భాష అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోస్పాడు మండల కార్యదర్శి జి హరినాథ్ మాట్లాడుతూ గతంలో ఇల్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు గృహ రుణాలు ఇవ్వాలని కోరుతూ ఇల్లు లేని వారితో గ్రామ వార్డు సచివాలయంలో వ్యక్తిగత అర్జీలు ఇప్పించడం జరిగిందని తెలిపారు. అలాగే రెండో విడత వ్యక్తిగత అర్జీలు ఈనెల 10వ తేదీన తహశీల్దార్ కార్యాలయంలో ఇల్లులేని నిరు పేదలతో వ్యక్తిగత అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల సహాయ కార్యదర్శి మౌలా భాష, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై దాడిని ఖండించిన మున్సిపల్ సిబ్బంది

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిని బుధవారం ఉదయం శ్రీనివాస్ నగర్ లోని ఓ హెూటల్ వద్ద నాగి వెంకటేశులు అనే వ్యక్తి గొడవపడ్డాడు. మాట మాట పెరగడంతో అక్కడున్న ప్రజలు సర్ది చెప్పారు. దీంతో కమీషనర్ స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో అతనిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌పై దాడి చేసినవారిని వెంటనే అరెస్ట్ చేయాలని మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పెన్ డౌన్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరు, అధికారులు, యూనియన్ నాయకులు షణ్ముగం తదితరులు మాట్లాడుతూ అధికారులపై భౌతిక దాడులు చేయడం తగదని, ఏదైనా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

కక్షతోనే ఉద్దేశపూర్వకంగా డిఫాల్టర్ చేశారు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల విజయ డైరీ వద్ద టెన్షన్ నెలకొంది. ఇటీవల నంద్యాల విజయ డైరీ బోర్డు సమావేశంలో చిత్రానపల్లి పాల సొసైటీ డైరెక్టర్‌గా ఉన్న భూమా జగద్విఖ్యాత్ రెడ్డిని ఆ పదవిని తొలగిస్తున్నట్లు ప్రకటించి, డీఫాల్టర్ చేశారు. దీంతో భూమా జగద్విఖ్యాత్ రెడ్డి బుధవారం నంద్యాల పాల డైరీ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. విజయ డైరీ ఎండితో సమావేశమైన భూమా అనంతరం మీడియాతో మాట్లాడుతూ నాపై కక్షతో నన్ను ఉద్దేశ పూర్వకంగా డిపాల్టర్ చేశారని, తనను సొసైటి ప్రెసిడెంట్ గా డిపాల్టర్ ఎలా చేస్తారని, డైరీ మేనేజింగ్ డైరెక్టర్‌ను విఖ్యాత్ నిలదీశారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్ళానని, కోర్టులో తనకు అనుకూలంగా తీర్పు వస్తుందనే నమ్మకం ఉందన్నారు. డైరీ ఛైర్మన్ జగన్ డైరెక్టర్లతో క్యాంప్ రాజకీయాలు చెయ్యడం తగదని హెచ్చరిస్తూ విజయ డైరీ డైరెక్టర్లు ఛైర్మన్ చెప్పినట్లు నడుచుకుంటే అయన చేసిన అవినీతి మీకు అంటుకుంటుందన్నారు. జగత్ డైరీ అప్పు చెల్లించాల్సిన విషయం ఛైర్మన్‌కు ఐదేళ్ళకు గుర్తుకు రావడం ఏంటని, నిలదీశారు. విఖ్యాత్ డైరీకి రావడంతో డైరీ వద్దకు భారీగా పోలీసులు చేరుకున్నారు. తాలూకా సిఐ ఈశ్వరయ్య పోలీసులతో తరలి వచ్చి జగత్ మీడియా సమావేశం అనంతరం పోలీసులు వెనుదిరిగారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణం లోని చైతన్య భారతి ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎంఈఓ న్యాంతుల్లా బహుమతులను అందజేసారు. చైతన్య భారతి ఉన్నత పాఠశాల నందు బుధవారం సెమీ సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పిల్లల తల్లులచే నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, ఏవో పి.చంద్రకళ, డైరెక్టర్ పి.శారద, అకాడమీ డైరెక్టర్ చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు డి.మహమ్మద్ రఫీ, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొనడం జరిగింది.

బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలోని బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బ్యాంకర్లను సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బీసీల స్వయం సమృద్ధి రుణాల మంజూరుపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, యూబీఐ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సురేంద్ర గౌడ్, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ మనోహర్, బ్యాంక్‌ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ సుందరరాము తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బిసి, ఈ బీసీ వర్గాలకు వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ సర్వీసులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేసి జిల్లాను టాప్ ఫైవ్‌లో ఉంచాలన్నారు. లక్ష్యానికి మించి దరఖాస్తులు వస్తే స్క్రూటినీ చేసి అర్హత గల వ్యక్తులకే రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉమూమి తబ్లిగీ ఇస్తేమాను సందర్శించిన మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరులో ఏర్పాటుచేసిన ఉమూమి తబ్లిగీ ఇస్తేమా రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజ కుమారి గనియా, శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ముఖ్య అతిథులుగా హాజరై ఇస్తేమాను సందర్శించారు. అనంతరం అక్కడ సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇస్తేమాకు ప్రజలు ఎక్కడెక్కడ నుంచి వచ్చారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మత పెద్దలతో సమావేశమై కార్యక్రమం నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మంగళవారం ప్రారంభమైన ఇస్తేమా కార్యక్రమం గురువారం సాయంత్రం తో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపి ప్రాంతాలకు చెందినవారు పాల్గొన్నారు అనే విషయాలపై మత పెద్దలతో అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఇక్కడ ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యం కోసం ఏర్పాటుచేసిన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇంత పెద్ద పండుగ మా శ్రీశైల నియోజకవర్గానికి రావడం చాలా సంతోషకరమైన విషయమని ఎక్కడెక్కడ నుండో ఇస్తామాకు వచ్చినటువంటి ప్రజలు క్షేమంగా ఇస్తేమా ముగిసిన తరువాత తమ తమ ఇళ్లకు క్షేమంగా వెళ్లాలని ఆయన అన్నారు. అనంతరం మత పెద్దలు మంత్రి ఎంఎన్‌డి ఫారుక్, కలెక్టర్ రాజకుమారి గలియా, ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా కి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, ఆర్డిఓ, తహశీల్దార్, డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ అధికారిణి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వలసలు నివారించడంలో విఫలం

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు ప్రజలు ఇతర ప్రాంతాలకు గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు ఉపాధి లేక వలస బాట పట్టారని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో అనేక గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వలసలు వెళ్తున్న ఏపీడి ఎక్కడ ఉన్నారో కనీసం ఉపాధి పనులు పై అవగాహన కల్పించడంలో ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉపాధి పనులు కల్పించడంలో డ్రామా అధికారులు విఫలం చెందుతున్నారని వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వారన్నారు. తక్షణమే మండలంలోని అన్ని గ్రామాలలో అధికారులు ఉపాధి పనులు ప్రతి గ్రామంలో కల్పించి వలసలు ఆపాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు రోజులు పాటు ఉపాధి హామీ పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీడీ డోన్ క్లస్టర్ నరసింహారెడ్డి తెలిపారు. మొదటిరోజు బనగానపల్లె మండలం, కోయిలకుంట్ల, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీడి.నరసింహారెడ్డి ఉపాధి హామీ పథకంపై, పలు అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రేష్మ, కోర్సు డైరెక్టర్ పరమేశ్వర్ రెడ్డి, రవి ప్రకాష్, ఈసీ మక్బుల్ హుస్సేన్, సుబ్బన్న తిమ్మరాజు, రషీద్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-అవుకు: అవుకు పట్టణంలోని కోటా వీధిలో వెలిసిన అతి పురాతనమైన శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీ చెన్నకేశవ స్వామి భజన బృందం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తేదీ శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం అష్టోత్తర శతనామావళి, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం మీదుగా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. మెట్టుపల్లి దారిలోని సుద్ద కొండపై వెలిసిన మద్దిలేటి స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల ద్వారానే రుణాలివ్వాలి

విశాలాంధ్ర - శిరివెళ్ల: వ్యవసాయం చేస్తూ ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తున్న రైతన్నలకు ఆన్‌లైన్ రెవిన్యూ రికార్డుల ఆధారంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని తహశీల్దార్ పుష్ప కుమారి అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకర్లు పట్టాదారు పాసు పుస్తకం తో ప్రాధాన్యత లేకుండా రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిరివెళ్ల మండలంలోని ఆయా బ్యాంకర్లు రైతులను పట్టాదారు పాసుపుస్తకం పేరుతో పలుమార్లు బ్యాంకుల వద్దకు తిప్పుకోకుండా అర్హత గల ప్రతి రైతన్నకు రుణాలు మంజూరు చేసి, పొలం పెట్టుబడులకు సహకరించాలని తహశీల్దార్ పుష్పకుమారి సూచించారు.

రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా కల్వటాల గ్రామం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని కలవటాల గ్రామం ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కింద పైలట్ గ్రామంగా ఎంపికైందని తహశీల్దార్ బాలిశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం కలవటాల గ్రామ పంచాయతీ కార్యాలయం నందు మండల సర్వే సరిత, సర్పంచ్ కృష్ణ రంగారెడ్డి, ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. తాసిల్దార్ మాట్లాడుతూ కలవటాల గ్రామన్ని రీ సర్వే పైలట్ ప్రజెంట్‌గా ఎంపిక చేశామని తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీఆర్ఓ రామ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కాండం పురుగు నివారణకు చర్యలు

విశాలాంధ్ర - నందికొట్కూరు: మొక్కజొన్న పంటలో కాండం పురుగు నివారణకు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్షావలి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగుటూరు, కొణిదెల గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆయన రైతులకు తెలియజేస్తూ పిల్ల పురుగులు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటుందని, కాండం లోపలికి చేరి ఆకులపై వరుస క్రమంలో పొడవాటి చిల్లులు కనిపిస్తాయన్నారు.

వైకుంఠ ఏకాదశికి చురుగ్గా ఏర్పాట్లు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి సన్నిధిలో ఈనెల 10న శుక్రవారం జరగనున్న వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలకు చురుకుగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారము నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరద స్వామిని దర్శించుకునేందుకు భక్తులకు వీలుగా ఉండేందుకు మఠం అధికారులు క్యూ లైన్‌లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎగువ అహోబిలంలో శ్రీదేవి సమేత శ్రీ జ్వాల నరసింహా స్వామి దర్శించుకునేందుకు భక్తులకు వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నవనరసింహులలో ఒకరైన కారం జనరసింహస్వామి స్వయనా ఉత్తర ద్వారానే వెలిశారు. అందుకోసం ఇక్కడ ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేస్తున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 09, జనవరి 2025

ఇంటి స్థలాలకై జరగబోయే ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు: గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఈనెల 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా జరగబోయే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. అనంతరం బుధవారం రోజున సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని అందులో భాగంగా గ్రామీణ ప్రాంతంలో ఉండే ప్రజలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు రెండు సెంట్లు స్థలాలను ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని, గద్దెకెక్కిన కూటమి ప్రభుత్వం పరిపాలన వరంగా7 నెలలు కావస్తున్న ఇప్పటివరకు ఇంటి స్థలాలు చూపకపోవడం చాలా బాధాకరమన్నారు. గత నెలలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇంటి స్థలాలు లేని ప్రజల చేత అర్జీలను గ్రామా మరియు పట్టణ వార్డు సచివాలయాలకు సమర్పించడం జరిగిందని వారు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఒక సెంటు స్థలం ఏ మాత్రం సరిపోవడం లేదని, ఆ స్థలం ఊరి బయట, అడవి, పొలాల్లో, స్మశానాలలో ప్రాంతాలలో ఇవ్వడం జరిగిందన్నారు. ఇల్లు స్థలాలు లేని నిరుపేదలకు తక్షణమే ఇల్లు స్థలాలు ఇవ్వాలని ఈనెల 10వ తేదీన సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు జిల్లావ్యాప్తంగా కలెక్టర్ మరియు సబ్ కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున స్థలాలేని ప్రజలతో ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఈ ఆందోళన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, పంపనగౌడ్, భాస్కర్ యాదవ్, సిపిఐ పట్టణ నాయకులు కేసి జబ్బర్, దాదావలి,సిపిఐ మండల సహాయ కార్యదర్శి రాజీవ్, సిపిఐ నాయకులు విజయేంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సమస్యల పరిష్కారం కావాలంటే ఎర్రజెండ రావాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: పేదల సమస్యల పరిష్కారం కావాలంటే ఎర్రజెండా రాజ్యం రావాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏ ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గత ఎనిమిది రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షల కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏ ప్రతాపరెడ్డి ,జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు శేషాద్రి రెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన ఏ ప్రతాపరెడ్డి శేషాద్రి రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో పాలకుల విధానాలు పూర్తిగా పేదలకు వ్యతిరేకంగా ఉన్నాయని పాలకుల మెడలు వంచి మన సమస్యలు పరిష్కరించుకోవాలని లేదంటే పాలకులనే మార్చాలన్నారు. దేశంలో రాష్ట్రంలో పాలిస్తున్న వారు ఏనాడు గాని పేద మధ్య తరగతి ప్రజల సమస్యల గురించి అటు పార్లమెంటులో, ఇటు అసెంబ్లీలో ఏనాడు చర్చించలేదన్నారు. నోరు తెరిస్తే పేదవారి గురించి మాట్లాడుతారన్నారు. ఈ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అప్పనంగా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ ఉపాధి రంగాలన్నిటిని నీరుగార్చే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 12సార్లు కరెంటు చార్జీలు పెంచారని చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు అని విమర్శలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇంధనం సర్దుబాటు చార్జీల పేరుతో రెండు పర్యాయాలు పేద మధ్య తరగతి ప్రజల పైన విద్యుత్ భారం వేసిందన్నారు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఇసుక, సిమెంటు, స్టీలు రాష్ట్ర ప్రభుత్వమే ఫ్రీగా సప్లై చేయాలన్నారు. గత రెండు మూడు సంవత్సరాలుగా పేదల గుడిసెలు వేసుకొని నివాసముంటున్న ప్రాంతాలలో వారికి పట్టాలు ఇచ్చి ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీనివాసరావు నగర కార్యవర్గ సభ్యులు బీసన్న, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, మహిళా సమాఖ్య జిల్లా నగర కార్యదర్శులు శ్రావణి, భారతి, నాగేశమ్మ, సులోచనమ్మ, మునెమ్మ, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు ప్రజానాట్యమండలి నాయకులు మాణిక్యం, శీను, కర్ణాకర్, శివ, రాముడు, శాఖ కార్యదర్శులు సత్యం, బాబయ్య, మహిళలు దీక్షలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా తహశీల్దార్ బదిలీ

విశాలాంధ్ర– హెరాళ గుంద: మండల తహశీల్దార్ కె.సతీష్ కు పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు ఆర్ఎంపి పిఐపిఎస్ డిసి ల్యాండ్ అక్టివేషన్ ప్రమోషన్ ఇస్తూ బదిలీ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం చేసింది. తహశీల్దార్‌గా మండలానికి ఎన్నో సేవలు చేసిన సతీష్‌కు ప్రజలు, కూటమి నాయకులు, డిటి నిజాముద్దీన్, వీఆర్వోలు, సిబ్బంది అభినం దించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరించడానికి కృషి చేశానని సేవలో తృప్తినిచ్చిందని అన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర -వెల్దుర్తి: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని, గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఆవరణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కె.జగన్నాథం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంత అబద్ధాల ప్రభుత్వం అన్నారు. గత వైసిపి పాలనలో ప్రజలకు న్యాయం జరుగలేదన్నారు. సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ,సిపిఐ పట్టణ కార్యదర్శి గిరి, రైతు సంఘం అధ్యక్షులు డి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, చిన్న వ్యాపార సంఘం అధ్యక్షుడు అనీలు, మినీ ఆటో నాయకులు, రాముడు పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ

విశాలాంధ్ర -చిప్పగిరి: గ్రామీణ ప్రాంతాలలోని వీధులు అధ్వానంగా మారడంతో స్వచ్ఛందంగా గ్రావిల్ వేసుకోవడం జరిగిందని దౌల్తాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్ అన్నారు. మండల పరిధిలోని దౌల్తాపురం గ్రామం నందు బీసీ కాలనీ నందు రోడ్డు అద్వానంగా మారడంతో స్వచ్ఛందంగా ఎవరి ప్రమేయం లేకుండా దాదాపు 60 మీటర్లు పొడవున గ్రావెల్ వేవించి జెసిబి ద్వారా చదును చేయడం జరిగిందని గ్రామానికి చెందిన రాజశేఖర్ తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాలలో చదువుకున్న యువకులు మానవ దృక్పల్పంతో ఆలోచిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మేకల రామాంజనేయులు చెరువు హరి పాల్గొన్నారు.

10న జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : ఈ నెల 10వ తేదిన కర్నూలు జిల్లా పర్యటనకు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ మంత్రి నారా లోకేష్ రానున్నారు.కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ మంత్రి నారా లోకేష్ రా.9 గం.లకు అనతరపురం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి రా.11 గం.లకు కర్నూలు రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం చేరుకొని బస చేస్తారు. 10వ తేది ఉ.9గం.లకు రోడ్డు మార్గాన బయలుదేరి నగరంలోని పలు కళాశాలను పరిశీలిస్తారు.

బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

విశాలాంధ్ర ఎమ్మిగనూరు: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. తల్లికి వందనం పథకాన్ని ఈ సంవత్సరం నుండే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి కాళీ ప్లేట్లు చేతుల్లో పట్టుకొని రోడ్డుపైన ఉన్న ప్రతి షాపుల్లో బిక్షాటన చేస్తూ అనంతరం వైఎస్సార్ సర్కిల్ నందు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ బాష, రాష్ట్ర సమితి సభ్యులు విజేంద్ర హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకం ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేసి, తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు విష్ణు,అబ్దుల్ ఖాదర్, రంగస్వామి వీరేష్, మోహన్, సమీర్, సురేష్, మహేష్, రవి, సంతోష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర – హెరాళగుంద: అనారోగ్యం వల్ల ఆటో డ్రైవర్ హానికట్ శుభాన్ బుధవారం మృతి చెందారని జిల్లా ఉన్నతాధికారులు ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐటీయూసి మండల అధ్యక్షుడు రంగన్న డిమాండ్ చేశారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని సాకుతున్న డ్రైవర్ సుభాన్ మృతి చెందడంతో భార్య కాశీమ, ఆరు మంది పిల్లలు అనాధలుగా మారారని అన్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి ఆసుపత్రిలో చేరారని వైద్య చికిత్స పొందుతూ మృతి చెందారని, మృతుడి భార్యకు వితంతు పెన్షన్, ఇంటి స్థలం, చంద్రన్న బీమా ఇన్సూరెన్స్ డబ్బులు మంజూరు చేయాలని కోరారు. మృతుడు సుభాన్ ఆటో యూనియన్‌లో చురుగ్గా పాల్గొన్నారు. ఎన్నో పోరాటాలు చేశారని మృతుడి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు.

వందేళ్లు ప్రజా శ్రేయస్సుకే సీపీఐ కృషి

విశాలాంధ్ర – నందవరం : మండలంలోని నాగలదిన్నె గ్రామంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జండా విష్కరణ కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంపన్న గౌడ్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని, వంద సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా భారత దేశమంతట ఈ సంవత్సర కాలం గ్రామాలలో సభ లు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భవిష్యత్తులో మతోన్మాద పార్టీలకు వ్యతిరేకంగా, లౌకిక రాజ్యాన్ని స్థాపించే దిశగా, ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా పోరాటాల నిర్వహిస్తామన్నారు. సిపిఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, శాంతన్న, అబ్దుల్ గఫూర్, జబ్బర్ నబి, కాశి, తిమ్మప్ప, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలపై వదంతులు నమ్మొద్దు

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం 2025-26 నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బోర్డ్ పరీక్షలను నిలిపి వేస్తున్నట్లు కొన్ని మీడియాలో ప్రచారం జరుగుతుందని ఆర్ఐ గురువయ్య శెట్టి బుధవారం తెలిపారు.ఈ విషయంపై బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేయబడింది. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ప్రతిపాదిత విద్యా సంస్కరణలను ప్రజల అభిప్రాయాలు, సూచనలు కోసం బహిరంగంగా ఉంచిందని తెలిపారు. మీ సూచనలను, అభిప్రాయాలను ఈ నెల 26లోగా తెలియజేసిన ఇమెయిల్ ఐడికి పంపవచ్చు అన్నారు.

పలు ప్రాంతాల్లో కమిషనర్ విస్తృత పర్యటన

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు విస్తృతంగా పర్యటించారు. బళ్లారి చౌరస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న బస్ షెల్టర్, ఇందిరాగాంధీ నగర్ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు రహదారి, వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో పలు సమస్య ప్రదేశాలను కమిషనర్ పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, కార్పొరేటర్ మునెమ్మ, డిఈఈ గంగాధర్, బిల్డింగ్స్ ఇంస్పెక్టర్ అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇల్లు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-ఆలూరు : సీపీఐ, బికేఎంయు ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఎన్నికల హామీలను అమలు పరచాలని, బికేఎంయు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం భూములు కొని పేదలకు పంచాలని, గిరిజన ప్రాంతాల్లో ఉన్నటువంటి భూములను గిరిజనులకు పంచాలని, తక్షణమే వీటన్నిటిని అమ్ములు పరచాలని ఈనెల 10వ తేదీన ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బికేఎంయు రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారు. సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి రంగన్న, సిద్దేశ్వర శాఖ కార్యదర్శి సిద్ధ లింగ, నరసింహులు పాల్గొన్నారు.

పింఛన్‌ల లబ్ధిదారుల జాబితాపై సర్వేలు

విశాలాంధ్ర – సి.బెళగల్: పింఛన్ లబ్ధిదారుల సర్వేలపై పునః పరిశీలన చేపట్టారు. మండల పరిధిలోని కొత్తకోట, బ్రాహ్మణ దొడ్డి గ్రామాల్లో గ్రామ పంచాయతీ మజార గ్రామమైన ఎర్రగుంట్ల గ్రామంలో దివ్యాంగుల పింఛన్‌ల లబ్ధిదారుల జాబితాపై కిరణ్ కుమార్, పద్మజ లు బుధవారం ఎంపీడీవో రాణెమ్మతో కలిసి పింఛన్ తీసుకునే లబ్ధిదారుల పింఛన్లను పునః పరిశీలించారు. పున పరిశీలనలో వయసు నిర్ధారణ లేకున్నా, అర్హులు కానీ వారు పెన్షన్ తీసుకుంటున్నా అటువంటి వాటిని గుర్తించి తగు జాబితా తయారు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎంపీడీఓ రాణెమ్మ, పరిషత్ సిబ్బంది,గ్రామ పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

విశాలాంధ్ర-పత్తికొండ: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య, ఏపీ కౌలుదారు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబులయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథంలు విమర్శించారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండలో ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలుదారు రైతు సంఘం జిల్లా సమితి సమావేశం పంపన్న గౌడ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ పాలనలో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించక ఒక లక్ష యాభై వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టం తీసుకురావాలని, అన్ని రకాల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేసి రైతుల ఆత్మహత్యలు నివారించాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వ్యవసాయ రంగానికి 50 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఎటువంటి పూచికత్తు లేకుండా పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలలో రూ.20 వేలు తక్షణమే జమ చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, గుండ్రేవుల, ఆర్డీఎస్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ కింద కుడి, ఎడమ కాలువ పనులను పూర్తి చేసి పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు చేపడుదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లా సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.భీమ లింగప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, గోపాల్, లక్ష్మి రెడ్డి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాపతి, సురేంద్ర కుమార్, నాయకులు కారన్న, రామాంజనేయులు, వెంకటరామిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీత్ సింగ్ దలే వాలే ప్రాణాలు కాపాడండి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : దేశవ్యాప్తంగా రైతుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ రైతు సంఘం నాయకులు జగ్జీత్ సింగ్ దలే వాలే దేశ రాజధాని ఢిల్లీ నగరంలో గత 45 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నాడని ఎలాంటి హాని జరగక ముందే కేంద్ర ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కరించి ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశాడు. జగ్జీత్ సింగ్ దలే వాలే ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా కర్నూల్ కలెక్టర్ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జగన్నాథం మాట్లాడుతూ గత మూడేళ్ల కిందట రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలన్నారు. ఢిల్లీ నగరాన్ని దిగ్బంధించిన రైతుల సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల గడుస్తా ఉన్న ఆ హామీ నెరవేర్చకపోవడంతో వెంటనే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రైతు ఉద్యమంకి తలవంచి గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని దేశంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలను నివారించాలన్నారు. 75 ఏళ్ల జగ్జీత్ సింగ్ దలే వాలే గత 45 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆమరణ నిరాహార దీక్షను విరమించే విధంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని, ఆయన ఆరోగ్యాన్ని కాపాడాలని, లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉద్యమానికి శ్రీకారం చుడతామని జగన్నాథం హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మల్లికార్జున, బాబయ్య, రబియా, మధు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర– కౌతాళం: సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించడం జరిగింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భాగ్యాలను ఇచ్చే భోగి, సరదాలను ఇచ్చే సంక్రాంతి, కమ్మని కనుమ, కొత్త సంవత్సరంలో, కొత్త వెలుగులు నింపాలని కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష కోరారు. ఈ సందర్భంగా బాలికలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఇందులో ప్రతిభ కనబరిచిన బాలికలకు మెడల్ ప్రశంసా పత్రాలతో, అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి సంప్రదాయాల గుర్తుయే పండుగలని, ఇలాంటి పండుగలను పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాలలో చూడముచ్చటగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్రు-హెరాళగుంద: హెరాళగుంద మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సులు బుధవారం పెద్దహ్యా ట గ్రామంలో ముగిసింది. తహశీల్దార్ కె.సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భూముల రీసర్వేల కోసం గ్రామసభ నిర్వహించామని, ఏమైనా సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసుకున్న రైతు సమస్యలను రెవెన్యూ సిబ్బంది ద్వారా విచారించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. గ్రామ సర్పంచ్ డిఎస్ హేశానుల్ల, ఎంపీటీసీ శివన్న, వీఆర్వో ప్రహల్లాద, రీసర్వే డీటీ ముకుందరావు పాల్గొన్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర – ఆదోని : పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ బుక్‌ను అందజేశారు. బుధవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి అధ్యయన సామాగ్రిని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో దాతలు నాగరాజు స్వామి, భీమపల్లి సహకారంతో డిప్యూటీ డీఈఓ వెంకటరమణ రెడ్డి,మండల విద్యాధికారులు జి.రాజేంద్రప్రసాద్,పి.శ్రీనివాసులు పదవ తరగతి విద్యార్థులకు మునిసిపల్ ఉన్నత పాఠశాల, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ఆర్.ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాల, కెజిబివి(జనరల్), కెజిబివి (మైనారిటీ) పాఠశాలలకు 350 మెటీరియల్స్‌ను ఎస్టీయూ సంఘ నాయకులు ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ వెంకట రమణ రెడ్డి,మండల విధ్యాధికారులు జి.రాజేంద్రప్రసాద్, పి.శ్రీనివాసులు, నాయకులు సి.నాగరాజు, వి.రమేష్ నాయుడు, జి.వీరచంద్ర యాదవ్ మాట్లా డుతూ

సాధారణ విద్యార్థులు ఉత్తీర్ణత పొందే విధంగా పాఠ్యపుస్తకంలోని ముఖ్యమైన భావనలతో స్టడీ మెటీరియల్‌ను రూపొందించడం జరిగిందన్నారు. నాయకులు లోక్య నాయక్, రవి, భీమరాజు పాల్గొన్నారు.

ఈ నెల 9న జిల్లాలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: ఈ నెల 9వ తేదిన కర్నూలు జిల్లా పర్యటనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రానున్నారు. 9 వ తేదీన ఉ.11 గం.లకు గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరి ఉ.11:45 గం.లకు కర్నూలు విమానాశ్రయం చేరుకుంటారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ఉ.11:50 గం.లకు హెలికాప్టర్ లో బయలుదేరి గణి సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్ ను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించి, మ.12:30 గం.లకు అప్పర్ రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అప్పర్ రిజర్వాయర్ హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మ.12:40 గం.లకు అప్పర్ ఇన్టేక్ వ్యూ పాయింట్ కు చేరుకుంటారు. మ.12:40గం.ల నుండి మ.1:15 గం.ల వరకు ప్రాజెక్ట్ ను పరిశీలించి, మ.1:15 గం.లకు అప్పర్ ఇన్టేక్ వ్యూ పాయింట్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మ.1:25 గం.లకు పవర్ హౌస్ కు చేరుకుంటారు, అక్కడి నుంచి మ.1:40 గం.లకు రోడ్డు మార్గాన బయలుదేరి మ.1:45 గం.లకు టిఆర్సి వ్యూ పాయింట్ చేరుకుంటారు. మ.2 గం.లకు టిఆర్సి వ్యూ పాయింట్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మ.2:15గం.లకు వసతి గృహం చేరుకుంటారు. మ.3:30గం.లకు గెస్ట్ హౌస్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి గెస్ట్ హౌస్ బి3 బ్లాక్ చేరుకుంటారు. మ.3:35గం.ల నుండి సా.4:05 గం.ల వరకు సంబంధిత అధికారులు ఉప ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ వివరాలను వివరిస్తారు. అనంతరం సా.4:05 గం.లకు బి3 బ్లాక్ నుండి అప్పర్ ఇంటెక్ వ్యూ పాయింట్ కు బయలుదేరి సా.4:20గం.లకు అక్కడికి చేరుకుంటారు. సా.4:25 గం.లకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సా.4:50గం.లకు కర్నూలు విమానాశ్రయం చేరుకుంటారు. సా.4:55 గం.లకు కర్నూలు విమానాశ్రయం నుండి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారు.

అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కిట్ల పంపిణీ

విశాలాంధ్ర – కోడుమూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాలలో ఐదేళ్లలోపు చిన్నారులపట్ల పటిష్ట కార్యచరణ రూపొందించి మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు విద్యాభ్యాసానికి దోహదం చేసే ప్రీ ప్రైమరీ (పిపి-1,2) బుక్స్ తో పాటు సామాగ్రి, మెడికల్ కిట్లను ఐసిడిఎస్ పిడి నిర్మల పంపిణీ చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్వాడి కార్యాలయంలో సిడిపిఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి కోడుమూరు సి.బెళగల్, గూడూరు, కర్నూలు రూరల్ మండలాల పరిధిలోని 251 అంగన్వాడి కేంద్రాల కార్యకర్తల తోపాటు 3 మినీ అంగన్వాడి కేంద్రాల నిర్వహకులు హాజరయ్యారు.అంగన్వాడి కేంద్రాలలో సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ కార్యక్రమంలో భాగంగా బాల సంజీవిని యాప్ లో నమోదు చేసిన చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై అంగన్వాడీ కార్యకర్తలకు పిడి నిర్మల పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ నిర్మల మాట్లాడుతూ ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ బరువు అనే అంశాలపై వివరిస్తూ ఏ వయసు పిల్లలు ఎంత బరువు ఉండాలని, చిన్నారులకు పౌష్టికాహారం ఎంత మోతాదులో అందించాలనే వాటిపై వివరించారు.అంగన్వాడీ కేంద్రాలలో తక్కువ బరువు ఉన్న పిల్లలు ఉండరాదన్నారు. పిడి కార్యాలయ సిబ్బంది జిల్లా కోఆర్డినేటర్ బాలు పౌష్టికాహార లోపం బరువు తక్కువగా ఉన్న ఐదేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై అంగన్వాడీ కార్యకర్తలకు పలు సూచనలు సలహాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా సెక్టార్ల సూపర్వైజర్లు విజయలక్ష్మి,పద్మావతి, జరీనా,మల్లీశ్వరి,రాజమ్మ,సుజాత, అన్ని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, తదితరులు హాజరయ్యారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హౌసింగ్, రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్, పంచాయతీ రాజ్ సీసీ రోడ్లు, ఉపాధి హామీ, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల్లో ఇంకా 67 శాతం అర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. కృష్ణగిరి, మద్దికెర, కర్నూలు, సి.బెళగల్, మంత్రాలయం, పెద్ద కడబూరు మండలాల్లో ఇంకా 75 శాతం అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరితగతిన పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లో 30 శాతం పరిష్కారం అయ్యాయని, పత్తికొండ, కర్నూలు రెవెన్యూ డివిజన్ లలో తక్కువ సంఖ్యలో పరిష్కారం అయ్యాయని, పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 09, జనవరి 2025

ఎలక్ట్రానిక్ కాటా తూకంలో మోసం

విశాలాంధ్ర – ఆస్పరి: ఎలక్ట్రానిక్ కాటాలో తూకంతో మోసం చేస్తున్న జొహరాపురానికి చెందిన కంది వ్యాపారి రంజాన్ పై తూనికల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు రూ.50 వేలు అపరాధ రుసుం విధించారు. మండల పరిధిలోని జొహరాపురం గ్రామానికి చెందిన పింజారి రంజాన్ గత కొన్ని ఏళ్లుగా పప్పుశనగ, మొక్కజొన్న, కంది వ్యాపారాన్ని చేస్తున్నాడు. సోమవారం గ్రామానికి చెందిన కొంతమంది కంది పంట రైతులు కందులను రంజాన్ కు బాదుతో కలిపి 51 కేజీల 300 గ్రాములు ప్యాకెట్ చొప్పున దాదాపుగా 1500 కింటాల కందులను రంజాన్ కొనుగోలు చేశారు. అందులో కొండప్ప అనే రైతు ఉన్నాడు. బుధవారం ఉదయం కందుల వ్యాపారి రంజాన్ గ్రామంలో కంది పంట 50 కేజీల ప్యాకెట్లను కొనుగోలు చేస్తుండగా కొండప్ప దగ్గర ఉన్న 54 కేజీల 200 గ్రాముల బస్తాను రంజాన్ ఎలక్ట్రానిక్ కాటలో వేయగా 50 కేజీల లోపు తూకం తక్కువగా చూపాయి. ఇలా క్వింటానికి 10 కేజీలు తక్కువగా చూపడంతో రైతులకు అనుమానం వచ్చింది. దీంతో కంది పంట రైతులు మోసపోయామని గ్రహించి, ఆదోని తూనికల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం మధ్యాహ్నం జొహరాపురం గ్రామానికి వచ్చిన అయన రంజాన్ దగ్గర ఉన్న ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలించి ఎలక్ట్రానిక్ చిప్స్ సెట్టింగ్ ద్వార రైతులకు జరిగిన మోసాన్ని స్వయంగా గుర్తించారు. అనంతరం వారి దగ్గర ఉన్న ప్రభుత్వం వారి 20 కేజీల తూకం రాయిని రంజాన్ ఎలక్ట్రానిక్ కాటలో పెట్టగా 19 కేజీల 200 గ్రాములు మాత్రమే వచ్చింది. అనంతరం వ్యాపారి రంజాన్ కు రూ. 50 వేలు అపరాధ రుసుం విధించారు. మొదటిసారి కావడంతో అపరాధ రుసుము విధించామని, రెండవసారి మోసాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఎక్కడైనా తూనికలు, కొలతలలో తేడాలు వస్తే మా తూ.కొ. శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు.

రెండేళ్ల బాలుడికి అసాధారణంగా పెరిగిన కిడ్నీ

విశాలాంధ్ర – వైద్యశాల, కర్నూలు : రెండేళ్ల వయసున్న బాలుడికి కడుపు మొత్తం ఒకవైపు ఉబ్బి పోయి, తీవ్ర మైన నొప్పితో బాగా ఇబ్బంది పడుతున్నాడు. ఒక కిడ్నీ పూర్తిగా పనిచేయకుండా పోవడంతో పాటు అది అసాధారణంగా పెరిగి పోవడం వల్లే ఈ సమస్య ఏర్పడింది. ఆ బాలుడికి చికిత్స చేసిన కర్నూలు కిమ్స్ ఆస్పత్రికి చెందిన యూరాలజీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్టు, ఆండ్రాలజిస్టు, సంతాన సాఫల్య నిపుణుడు డాక్టర్ వై.మనోజ్ కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలిపారు. కర్నూలు ప్రాంతానికి చెందిన రెండేళ్ల బాలుడికి పుట్టక ముందునుంచే, అంటే గర్భస్థ శిశువుగా ఉండగానే సమస్య ఉందని, అతడి ఎడమ కిడ్నీ పనిచేయడం లేదన్నారు. దానికితోడు సాధారణంగా రెండేళ్ల వయసులో అంటే కిడ్నీ పరిమాణం 4 సెంటీమీటర్లు ఉండాలని, కానీ అది అసాధారణంగా పెరిగిపోయి 20 సెంటీమీటర్ల స్థాయికి చేరుకుందన్నారు. అది మూత్రనాళాన్ని కూడా నొక్కేయడంతో అవి మూసుకుపోయాయని, దానివల్ల నీరంతా పొట్టలోకి చేరి పొట్ట ఒకవైపు బాగా ఉబ్బిపోయి, బాలుడికి కడుపునొప్పి తీవ్రంగా వచ్చేదని తెలిపారు. అతడి తల్లిదండ్రులు ముందుగా ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి, అక్కడి వైద్యుల సూచన మేరకు కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇక్కడ అవసరమైన పరీక్షలన్నీ చేసిన తర్వాత.. పని చేయకుండా, ఇబ్బంది పెడుతున్న కిడ్నీని తొలగించడమే మంచిదని నిర్ణయించినట్లు తెలిఆపారు. బాలుడి వయసు రెండేళ్లు మాత్రమే కావడంతో ఓపెన్ సర్జరీ కాకుండా లాప్రోస్కొపిక్ పద్ధతిలో చేయాలని భావించామని, కేవలం ఒకటి, ఒకటిన్నర సెంటీమీటర్ల మేర చిన్న కోతలు మాత్రమే పెట్టి. వాటి ద్వారా పాడైన కిడ్నీ మొత్తాన్ని తొలగించామన్నారు. దానికిముందు పొట్టలో చేరిన నీటిని తీసేశామని, ఇప్పుడు ఉన్న ఒక్క కిడ్నీ బాగా పనిచేస్తోందని వెల్లడించారు. బాబుకు ఒక్కటే కిడ్నీ ఉన్నా వచ్చిన ఇబ్బందేమీ లేదని, ఆడుకోవచ్చని, స్కూలుకు వెళ్లొచ్చు, అన్ని పనులూ చేసుకోవచ్చని తెలిపారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర – రుద్రవరం: మండల కేంద్రంలోని 1వ సచివాలయ ఆవరణంలో బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా మండలంలోని 19 రెవెన్యూ గ్రామాలలో వివిధ భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలలో రైతులు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 150 పైగా దరఖాస్తులను అందజేశారు. వీటిలో ఇప్పటికే 30 దరఖాస్తుల పైగా పరిష్కారమైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రుద్రవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి రైతులు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలస్వామి, వైసిపి నాయకుడు బైరిబ్రహ్మం, ఐకెపి సర్వేయర్ వెంకట రమణ, వీఆర్వోలు సంజీవరెడ్డి, యువకాంతు, నరసింహులు, మోహన్, అంకాలు, రవీంద్ర, కార్యదర్శులు సుబ్బారావు, గోపాల్, మల్లికార్జున్ రెడ్డి, సర్వేయర్ జయచంద్ర, నిజాముద్దీన్, పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర– హొళగుంద: హొళగుంద పోలీస్ స్టేషన్‌లో బుధవారం పత్తికొండ డిఎస్పి బి వెంకట రామయ్యను సిబిఎన్ ఆర్మీ మండల అధ్యక్షుడు ముళ్ళ మోయిన్, మాజీ జిల్లా వక్ఫ్‌బోర్డు మెంబర్ కీ జాకీర్, టిడిపి నాయకులు మహేష్, శాలిఅమాన్ శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. డిఎస్‌పి ఆలూరు సిఐగా, పత్తికొండ డిఎస్పీగా పదోన్నతులు పొందారని భవిష్యత్తులో ఎస్పి స్థాయి వరకు ఉన్నత పదవి పొందాలని అన్నారు. డిఎస్‌పి స్థాయిలో ప్రజలకు ప్రజలకు న్యాయం అందిస్తున్నారని బాధితులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. డీఎస్పీ వెంట ఎస్సై బాల నరసింహులు, ప్రొఫెషనల్ ఎస్సై మహబూబ్ బాష, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ నాయక్ పాల్గొన్నారు

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో ఈనెల 12వ తేదీ ఆదివారం ముగ్గుల పోటీలు, గాలిపటం ఎగరవేయు పోటీలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. బుధవారం వారు మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో చుక్కల ముగ్గుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మొదటి బహుమతి కింద ఫ్రిడ్జ్, రెండో బహుమతి కింద కూలర్, మూడవ బహుమతి కింద వాషింగ్ మిషన్ ఇస్తామన్నారు. గాలిపటం ఎగరవేయు పోటీలలో విజేతలకు మొదటి బహుమతి కింద రూ.10 వేలు, రెండవ బహుమతి కిందరూ.5 వేలు ఇస్తామన్నారు. ఆళ్లగడ్డ తాలూకా ప్రజలందరూ ఈ పోటీల్లో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

11న మార్పు బాలకృష్ణమ్మ గారీ స్మారక సభ

విశాలాంధ్ర – శిరివెళ్ల : జనవరి 11వ తేదీన నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కాలేజీలో జరిగే ఉపాధ్యాయ ఉద్యమ నేత, మాజీ శాసనమండలి సభ్యులు కామ్రేడ్‌లి మార్పు బాలకృష్ణమ్మ 12వ లిరాష్ట్ర స్మారక సభనులి విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు కె.సాంబశివుడు జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీని వాసులు ఉపాధ్యాయులను కోరారు. బుధవారం సిరివెళ్ల మండలంలో ఉపాధ్యాయులను కలిసి సభను విజయవంతం చేయవలసినదిగా కోరుతూ కరపత్రాలను విడుదల చేయడం జరిగినది. అనంతరం రాజనగరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కామ్రేడ్ మార్పు బాలకృష్ణమ్మ గారు ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా శ్రీకాకుళంలో జరిగిన గిరిజన రైతాంగ పోరాటంలో పాల్గొన్నారన్నారు. ఈ సమావేశంలో సిరివెళ్ల మండల అధ్యక్షుడు జిపి గురువయ్య, ప్రధాన కార్యదర్శి నగిరి వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్లు ఎస్.కాశీం సాహెబ్, వై.విజయ్ కుమార్, ఎం.తిమ్మారెడ్డి, వై.ఆంజనేయులు, నూరుల్లా బేగ్, ఎం.సురేష్, వై.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏకాదశి వేడుకలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర – రుద్రవరం: ఈనెల 10వ తేదీన మండల కేంద్రం లోని కాశీ విశ్వేశ్వర ఆంజనేయస్వామి, లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షులు నూకల కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ నల్లగట్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వంకదార శ్రీనివాసులు, కోశాధికారి బోనగిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి ఆలయంలో రాత్రి 2 గంటలకు అభిషేకం, తెల్లవారుజామున 4 గంటలకు ఉత్తర ద్వార దర్శనం, ఉదయం 10 గంటలకు కళ్యాణం, మధ్యాహ్నం 1 గంటకు అన్నదానం, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

శునకాలకు పకడ్బందీగా శస్త్ర చికిత్సలు నిర్వహించాలి

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని భారత జంతు సంక్షేమ మండలి సభ్యురాలు అంజలి గోపాలన్, నగరపాలక అధికారులకు సూచించారు. శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రం నిర్వహణకు సంబంధించి అనుమతుల కోసం నగరపాలక, భారత జంతు సంక్షేమ మండలికి ధరకాస్తు చేసుకుంది. అందులో భాగంగా భారత జంతు సంక్షేమ మండలి సభ్యురాలు బుధవారం కర్నూలు నగరానికి వచ్చారు. నగర శివారు గార్గేపురం డంప్‌యార్డులోని శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. గార్గేపురం డంప్‌యార్డుకు చేరుకున్న ఆమెకు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమె కేంద్రంలో ఉన్న శస్త్ర చికిత్స గదులు, శునకాల బోను, తదితర సౌకర్యాలను పరిశీలించారు. పలు యంత్రాల చిత్రాలను స్వయం తానే చరవాణిలో తీసుకున్నారు. నగరంలో శస్త్ర చికిత్సలు జరిగిన, ఇంకా జరగాల్సిన శునకాల సంఖ్య, కేంద్రంలో శునకాలకు అందించే ఆహారం, శస్త్ర చికిత్సలు నిర్వహించే పద్ధతులు, వంటి వివరాలపై అంజలి గోపాలన్ ఆరా తీశారు. నగర శివారున విశాలమైన ఆహ్లాదకరమైన ప్రదేశంలో కేంద్రం ఏర్పాటు చేయడంపై ఆమె అధికారులను ప్రశంసించారు. శునకాలకు సంతాన నియంత్రణ క్షేత్ర చికిత్సలను పునఃప్రారంభించేందుకు, నవోదయ సొసైటీకి ప్రాజెక్ట్ రికగ్నేషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు అంజలి గోపాలన్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద నివారణకు త్వరలోనే సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. తొలుత ప్రతిరోజు సామర్థ్యం ఉన్న 20 శునకాలకు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తామని, మరో 12 శునకాలకు శస్త్ర చికిత్సలకు సంబంధించిన కేంద్ర నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. నగరంలో ఇప్పటికే 10,054 శునకాలకు శస్త్ర చికిత్సలు జరిగాయని, ఇంకా 4 వేలకు పైగా శునకాలకు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందన్నారు. ఒక్కొక్క శునకానికి శస్త్ర చికిత్స నిర్వహించేందుకు నగరపాలక రూ.1500 లు ఖర్చు చేస్తుందన్నారు. అనంతరం అంజలి గోపాలన్, అధికారులతో కలిసి కేంద్రం బయట మొక్కలు నాటారు.కార్యక్రమంలో ఆరోగ్యధికారి డా.కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, వెటర్నరీ డాక్టర్ మల్లన్న, ఏఈ వైష్ణవి, నవోదయ సొసైటీ అధ్యక్షుడు గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాదాసి, మాదారి కురవలకు ఎస్సీ కుల సర్టిఫికెట్స్ జారీ చేయాలి

విశాలాంధ్ర– ఆలూరు: ఆంధ్రప్రదేశ్ మాదాసి,మదారి కురువ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆలూరు తాలూకా కన్వీనర్ కౌడికి రాజు ఆధ్వర్యంలో తహాశీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కౌడికే రాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్వహించిన కులగనన సర్వేలో మా కులస్తులు మాదాసి కురువ, మదారి కురువ అని చేర్చడం జరిగింది ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ కొరకు రాష్ట్ర ప్రభుత్వాలు కులగనను సర్వే చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా పలు గ్రామాలలో కులగనన లిస్ట్ సచివాలయంలో ప్రదర్శించడం జరిగింది. అందులో మాదాసి కురువ మదారి కురువ ఉండడంతో ఎస్సీ జాబితాలో ఉన్న కులాలవారు వారు జీర్ణించుకోలేక ఆంధ్రప్రదేశ్లో మాదాసి, మాదారి కురువలు లేరు, తెలంగాణ, కర్ణాటకలో ఉన్నారన్నారు. ఇలా అవగాహన రహితంగా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడుతున్నారన్నారు. కనీసం ఎస్సీ జాబితాలో ఉన్న కులాల పట్ల వారికి అవగాహన ఉందా లేదా అనే సందేహం ఎస్సీ జాబితాలో ఉన్న మిగతా ఉపకులాల వారు సందేహిస్తున్నారన్నారు. ఎస్సీ జాబితాలో ఉన్న 59 ఉపకులాలు ఒక్కో కులానికి ఒక్కో ఆచార వ్యవహారాలు ఉంటాయని ఒక కులాన్ని ఇంకో కులంతో పోల్చుకోకూడదన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆ రోజుల్లోనే పొందుపరిచారని, అది తెలియక కొంతమంది అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రంగన్న, మండల అధ్యక్షుడు టీచర్ శ్రీనివాసులు, రమేష్, మల్లయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందచేసిన బీసీ ఇందిరా రెడ్డి

విశాలాంధ్ర – బనగానపల్లె: బనగానపల్లె ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో సంక్రాంతి పండుగ సంబరాలు పురస్కరించుకొని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి ఇందిరమ్మల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు, మొహందీ పోటీలు పట్టణ ప్రజలను ఎంతగానో అలరించాయి. ముగ్గుల, మొహందీ పోటీలను ప్రారంభించి మంత్రి సతీమణి ఇందిరమ్మ కోలాటాలు, హరిదాసుల, సంక్రాంతి లక్ష్మిల వేషాల్లో పిల్లల నృత్యాల మధ్య వేదిక వద్దనుంచి ఊరేగింపుగా బయలుదేరి మైదానంలో ఏర్పాటు చేసిన భోగి మంటలను ముట్టించి పొంగల్ వేడుకలు జరిపారు. ముగ్గుల పోటి లో మొదటి బహుమతి లక్ష్మి రేణుక, స్వర్ణ స్వాతి, వేదావతి, పద్మావతి, లక్ష్మీదేవి గెలుపొందగా వారికి వాషింగ్ మిషన్, జిగ్ జాగ్ మిషన్, కూలర్‌ను బిసి ఇందిరారెడ్డి అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో పకీర రెడ్డి, టంగుటూరి సీనయ్య, రాయలసీమ సలం, బురానుద్దీన్, కృష్ణ నాయక్, లలిత ప్రకాష్, టీచర్ నాగరాజు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా దేవర మహోత్సవాలు

విశాలాంధ్ర– కోసిగి : మండల కేంద్రంలోని సిద్ధప్పపాలెం మారెమ్మ గుడి, కింది మారెమ్మ గుడి, ముసలి మారెమ్మ గుడి విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత దొరల కుటుంబం నుండి సర్కార్ కుంభంతో ఘనంగా దేవర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బుధ్ వారం అమ్మవారికి పూర్ణకుంభాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారు. కోసిగి గ్రామ దేవత మారెమ్మ దేవర సందర్భంగా కోసిగి మండల నాయకుల పిలుపుమేరకు గౌరవ ముఖ్య అతిథిగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మంత్రాలయం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి వారి సోదరులు ఎన్.రఘునాథ్ రెడ్డి, ఎన్.రామకృష్ణ రెడ్డి పాల్గొని గ్రామ దేవతకు సర్వేజనా సుఖినోభవంతు అంటూ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్తురెడ్డి పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేశ్, తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేష్, చింతలగేని నర్సిరెడ్డి, నాడిగేనేని అయ్యన్న తాయన్న, అరివిలి వీరేష్, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మృతి

విశాలాంధ్ర – పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్న కడబూరు గ్రామంలో టీడీపీ గ్రామ నాయకులు డోలు రామాంజనేయులు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, మంత్రాలయం నియోజకవర్గం టిడిపి నాయకులు రఘునాథ్ రెడ్డి లతో పాటు పలువురు రాజకీయ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి గ్రామ అధ్యక్షులు నరసన్న మృతుని కుటుంబానికి 10వేల రూపాయలు మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లారెడ్డి, బుసిరెడ్డి, కలుగొట్ల లక్ష్మన్న, కంపాటి లక్ష్మన్న, కోడిగుడ్ల లక్ష్మన్న, కల్లు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని ముస్లీం మైనార్టీ కాలనీ

విశాలాంధ్ర – ఆదోని రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఎలక్షన్ 40వ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు.బుధవారం ఆ కాలనీలో ఆమె పర్యటించారు. సిసి రోడ్లు లేక డ్రైనేజీ సమస్య పట్టిపీడిస్తుందని రహదారుల్లో లోతైన గోతులు ఉండడంతో మురుగునీరు నిలిచి ఉండి ప్రజల అనారోగ్యాల పాలవుతున్నారని ఆమె పర్యటనలో గమనించారు. కాలనీలో ఉర్దూ పాఠశాల భవనము, అంగన్వాడీ కేంద్రం కావాలని కాలనీ మహిళలు ఆమె దృష్టికి తీసుకు రావడము జరిగింది. కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి,మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించెందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించడంలో ఉపాధ్యాయుల సహకారం ఉండాలి

విశాలాంధ్ర – బనగానపల్లె: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ఉపాధ్యాయులు తమ వంతు సహకారం అందించి, ప్లాస్టిక్ భూతాన్ని అంతమందించాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. పట్టణంలోని మంత్రి బీసీ నివాసంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. మధుసూదన్ రావు, జిల్లా అధ్యక్షులు బి. మాధవ స్వామి అధ్యక్షతన ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరా రెడ్డి మాట్లాడుతూ మొక్కలు విపరీతంగా నాటి ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేస్తే వాతావరణంలోని మార్పులు సంభవించి మంచి వర్షాలు కురుస్తాయని భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజంలో నిర్మించడంలో మా వంతు కృషి చేస్తామని ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు వి.సుబ్బరాయుడు, కె.గోవింద నాయక్, జె.వెంకట కృష్ణుడు, కె.రమేష్, యాగంటప్ప, ఎస్.పోలియో నాయక్, ఎస్.ఓబులేసు, వీరన్న, శేఖర్, చాంద్ బాష, మహ్మద్ రఫీ, శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై డీటీఎఫ్ ధర్నా

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప తెలిపారు. బుధవారం డిటీఎఫ్ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 117 ను పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, జిల్లా, మండల బాధ్యులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, జగదీష్, రవీంద్ర వీరేష్ వెంకటాచలం సోమశేఖర్ పాల్గొన్నారు.

రైతులు స్వయం ప్రతిపత్తితో ఎదగాలి

విశాలాంధ్ర – చాగలమర్రి: రైతులు వ్యాపారపరంగా ఆలోచించి పంటలను సాగు చేసి స్వయం ప్రతిపత్తితో ఎదగాలని జిల్లా వ్యవసాయ అధికారి మురలీకృష్ణ సూచించారు. బుధవారం చాగలమర్రి పట్టణంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఇతరులపై ఆధారపడకుండా తాము స్వయంగా పండించిన దిగుబడులను విత్తనాలుగా తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ జిల్లా డిపిఎం నరేంద్ర రెడ్డి,ఏఓ రంగనేతాజీ, పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈఓలు, సచివాలయాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులు,రైతులు పాల్గొన్నారు.

ప్రధాన సంపాదకులుగా కె.సురేష్ కుమార్

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: కాకినాడలో జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర 17వ విద్యా వైజ్ఞానిక మహాసభల్లో కర్నూలు జిల్లాకు చెందిన యుటిఎఫ్ సీనియర్ నాయకులు కే సురేష్ కుమార్ ఐక్య ఉపాధ్యాయపత్రిక ప్రధాన సంపాదకులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రభాకర వర్మ ప్రకటించినట్లు జిల్లా నాయకులు తెలిపారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగానూ, ఐక్య ఉపాధ్యాయ పత్రిక చీఫ్ ఎడిటర్‌గాను కే సురేష్ కుమార్ కొనసాగన్నారు. యూటిఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులుగా బాధ్యతల్లో ఉన్న యుఆర్‌ఏ రవికుమార్ ను యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ సంఘం డైరెక్టర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ లో జిల్లా నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వడం పట్ల హర్షం ప్రకటిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటీ ఉపాధ్యక్షులు జి. హేమంత్ కుమార్, సీనియర్ నాయకులు ఎస్‌ఎం జయరాజు, యెహోషువాలు తెలిపారు.

పింఛన్‌ల పరిశీలన

విశాలాంధ్ర – చాగలమర్రి : రాష్ట్ర ప్రభుత్వం మంచాలకు,వీల్‌చైర్లకు పరిమితమై వైద్య సహాయం క్రింద నెలకు రూ 15 వేలు పింఛన్లను పొందుతున్న లబ్ధిదారులను వైద్య బృందం బుధవారం పరిశీలించారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా నుంచి వచ్చిన వైద్య బృందం సభ్యులు డాక్టర్ మోహన్ నాయక్ ఆర్థోపెడిక్, డాక్టర్ రాజశేఖర్ స్వరూప్ జనరల్ మెడిసిన్, డాక్టర్ నేగళ్ళ హుస్సేన్ మెడికల్ ఆఫీసర్‌లు రూ.15 వేలు పింఛన్లను పొందుతున్న 18 మంది లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు.నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని వైద్య బృందం తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల వెల్ఫేర్ సహాయకులు, డీఏలు, ఎంఎల్‌హెచ్‌పి లు,ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూమా సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర – చాగలమర్రి : దివంగత ఎంపీ,ఎమ్మెల్యే నంద్యాల జిల్లాకు చేసిన సేవలు చిరస్మరణీయం అని రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌భాష కొనియాడారు. బుధవారం చాగలమర్రి పట్టణం లోని టిడిపి కార్యాలయంలో భూమా నాగిరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. నంద్యాల,ఆళ్లగడ్డ నియోజకవర్గాలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు కొలిమి హుసేన్ వలి,జెట్టి నాగరాజు, మౌలాలి, హనీఫ్, నూర్‌బాష, జల్సా గౌస్, గఫార్, టైలర్ ఖాదర్, రమేష్, అజీం, రజాక్, రాజేష్, బారిక్‌చామల్ హుస్సేన్సా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవ

విశాలాంధ్ర – శ్రీశైలం: స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా పారిశుద్ధ్య స్వచ్ఛ సేవ కార్యక్రమంలో భాగంగా క్షేత్రంలో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు చేపటపడ్డాయి క్షేత్రంలో 6 జోన్లు, 11సెక్టార్లుగా విభజించి 66 ప్రదేశాలలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన రహదారులు ఆలయ మాడవీధులు గంగాధర మండపం పాతల గంగ స్నాన ఘట్టాలు, పంచ మఠాలు పాతాళ గంగ మెట్ల మార్గం మల్లికార్జున సదన్, గణేష్ సదన్, పాలధార పంచదార శిఖరం అటకేశ్వరం, భ్రమరాంబ అతిథి గృహ పరిసర ప్రాంతాలు మొత్తం 66 చోట్ల పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు సిబ్బందితో పాటు శివసేవకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర – వెలుగోడు: ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న వహీద్ అను విద్యార్థి ఆరోగ్యం విషమంగా ఉంది. రోజుకు రూ.70 వేల ఖర్చు అవుతున్నదని, హాస్పిటల్‌లో చూపించుకొనే స్తోమత లేదని, తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి బుధవారం విరాళంగా సేకరించిన మొత్తం సొమ్ము రూ.95313 ఆ విద్యార్థి తల్లిదండ్రులకు అందించడం జరిగింది. ఈ సొమ్ము ఇచ్చినటువంటి ప్రతి ఒక్కరికి పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. పట్టణానికి చెందిన అనేకమంది రాజకీయ నాయకులు, ఉద్యోగస్తులు, సోషల్ మీడియా ద్వారా స్పందించి ఆర్థిక సాయం అందించడం జరిగింది. త్వరితగతిన ఆరోగ్యవంతుడై తిరిగి రావాలని మనస్ఫూర్తిగా అందరూ కోరుకున్నారు.

ప్రజాదరణ పొందిన నాయకుడు భూమా నాగిరెడ్డి

విశాలాంధ్ర–రుద్రవరం: ప్రజాదరణ పొందిన నాయకుడుగా భూమా నాగిరెడ్డి ఒకరని, రాజకీయంలో తిరుగులేని నాయకుడిగా ఆయన ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచి ఉంటారని టిడిపి నాయకులు అన్నారు. బుధవారం దివంగత నేత భూమా నాగిరెడ్డి 61వజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ మండల కన్వీనర్ లింగం వెంకట రంగనాయకులు శెట్టి స్వగృహంలో దివంగత నేత మాజీ ఎంపీ భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.